ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్

To B2 chandra Naik s/o Valya naik age 39 lambada Y/o H no 7-15/1 yerugonda tanda bub nagar

Whereas your attendance is necessary answer to Charge of U/s 143, 341, 136 Y/o 149 IPC you are hereby directed to appear in person or by pleader before the Hon'ble Court Junior Civil Judge Court on the day 19-11-2014 at 10-30 a.m. Dated this 03 day of 09 20 24

In the Court of the Addl. Judicial Magistrate of First Class Mahabubnagar

కోర్టు నుంచి వచ్చిన నోటీసు

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకు గానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

మహాలక్ష్మి అలంకరణలో..



మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైర వేని సత్యనారాయణ- భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్

డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్‌కో 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.



గోవిందరావుపేట : లక్నవరం సరస్సులో పెద్ద బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు

పర్యాటక ప్రదేశాల్లో సండే సందడి

గోవిందరావుపేట/వాజేడు/వెంకటాపూర్, అక్టోబర్ 6 : ములుగు జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ఆదివారం సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు వద్దకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పర్యాటకులు తరలివచ్చారు. వేలాడే వంతెనపై నడుస్తూ సరస్సులో బోటు షికారు చేస్తూ ఎంజాయ్ చేశారు. అలాగే, వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం వద్ద కూడా సెలవుల నేపథ్యంలో సందడి నెలకొంది. జలపాతం వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు దిగారు. ఈత కొలనులో ఈతలు కొడుతూ, స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. జలపాతం పరిసరాల్లో బొగత సిబ్బందితో రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప దేవాలయం ఆదివారం విద్యార్థులు, పర్యాటకులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు రాగా స్వామివారికి అర్చకులు హరిశేశర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశేషాలను టూరిజం గైడ్స్ ద్వారా పర్యాటకులు తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. శిల్పాలను ఫొటోలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ఉపయోగించుకోవాలి

నర్సంపేట, అక్టోబర్ 6: పండుగ రోజుల్లో ప్రజలు ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను వినియోగించుకోవాలని వరంగల్, ఖమ్మం రీజియన్ లాజిస్టిక్ పేటీఎం టి.పవన్‌కుమార్ కోరారు. ఆదివారం నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తొమ్మిది డిపోల్లో 53 కార్గో కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. లాజిస్టిక్ కౌంటర్ల ద్వారా పార్సిళ్లను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని ముఖ్యమైన పట్టణాలకు వేగంగా, భద్రంగా చేరవేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫైర్ క్రాకర్స్ నిల్వలపై పోలీసుల దాడులు

- రూ. 24 లక్షల విలువైన పటాకులు సీజ్..వ్యాపారిపై కేసు నమోదు

పర్వతగిరి, అక్టోబర్ 6: మండలకేంద్రంలో అనుమతి లేకుండా పటాకులు నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్ ఆదివారం పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి రూ. 24.07 లక్షల పటాకులను పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని వ్యాపారి కొత్త రవితేజ పటాకులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నాడు. దీంతో పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి అతడి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 24,07,630 విలువైన పటాకుల బాక్స్‌లను స్వాధీనం చేసుకుని కొత్త రవితేజపై కేసు నమోదు చేశారు. విచారణ కోసం అతడిని పర్వతగిరి పోలీసులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

పటాకులను సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

- సకాలంలో నీరు రాక జనం ఇబ్బందులు
- స్కాడా సాంకేతికతపై బల్దియా నిర్లక్ష్యం
- పబ్లిక్ హెల్త్, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం

వరంగల్, అక్టోబర్ 6 : వరంగల్ త్రినగరిలో తాగునీటి సరఫరా చేయడంలో గ్రేటర్ కార్పొరేషన్ విఫలం అవుతోంది. రోజూ గ్రేటర్‌లో ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సరఫరా బంద్ అవుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైన్ లైన్లు, కనెక్షన్లు, వాల్వ్‌లపై సరిగా అవగాహన లేని ఇంజినీర్లతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న విమర్శలున్నాయి. దశాబ్దాల కాలం నాటి పైప్‌లైన్లతో లీకేజీలు, కొత్తగా వేసిన పైప్‌లైన్ల ఇంటర్ కనెక్షన్లు ఎక్కడ ఉన్నాయనే విషయాలు తెలియని ఇంజినీరింగ్ అధికారులతో నీటి సరఫరాలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. స్మార్ట్ సిటీ పథకంలో స్కాడా సాంకేతికతను తాగునీటి సరఫరాలో వినియోగించుకోవాలన్న ఆలోచనను బల్దియా అధికారులు పక్కన పెట్టారు. పాతకాలం నాటి విధానాలతో సరఫరాను చేస్తుండడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలో ఇటీవల వేసిన మిషన్ భగీరథ పథకం కొత్త పైప్‌లైన్లు, ఇంటర్ కనెక్షన్లపై బల్దియా ఇంజినీర్లకు అవగాహన లేక పోవడం, మిషన్ భగీరథ పనులను చేసిన పబ్లిక్ హెల్త్ శాఖతో సమన్వయం లేక పోవడంతో తాగునీటి సరఫరా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా పాత నగరం వరంగల్, అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.

బల్దియా వద్ద పైప్‌లైన్ మ్యాపులు లేవు..

గ్రేటర్ కార్పొరేషన్ వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్లకు సంబంధించిన ఎలాంటి మ్యాపులు లేవు.



నగరంలో తాగునీటి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చాలా వరకు పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో పైన్ లైన్లు వేశారు. పైప్‌లైన్ వేసిన తర్వాత డ్రాయింగ్‌లను బల్దియాకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఒక్క డ్రాయింగ్ కూడా కార్పొరేషన్ వద్ద లేక పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొత్తగా వేసిన పైప్‌లైన్లకు సంబంధించిన డ్రాయింగ్‌లను కార్పొరేషన్‌కు అప్పగించామని పబ్లిక్ హెల్త్ అధికారులు చెబుతున్నారు. బల్దియా అధికారులు మాత్రం తమకు ఎలాంటి డ్రాయింగ్‌లను అప్పగించలేదని అంటున్నారు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం నగర వాసులకు శాపంగా మారింది. దీనికి తోడు దశాబ్దాల కిత్రం ఇంజినీర్లుగా విధులు నిర్వర్తించిన అధికారులు అనధికారికంగా తమ ఇష్టం వచ్చిన ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం ఇంటర్ కనెక్షన్లు ఇవ్వడం, పైన్‌లైన్ వేయడంతో అసలు ఎక్కడ ఏ ఇంటర్ కనెక్షన్ ఉంది అనేది ప్రస్తుతం ఉన్న ఇంజినీర్లకు తెలియడం లేదు.

స్కాడాపై నిర్లక్ష్యం..

తాగునీటి సరఫరాలో స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ డాటా ఆక్విజిషన్) లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో బల్దియా అధికారులు నిర్లక్ష్యం వహించారు. ముఖ్యంగా భూగర్భంలో ఉండే పైన్‌లైన్ల నెట్ వర్క్‌ను, డాటాను సూపర్‌వైజ్ చేసేందుకు స్కాడా సాంకేతికత దోహద పడుతుంది. ఈ సాంకేతికతతో ఎక్కడ పైప్‌లైన్లు లీకేజీ అవుతున్నాయి.. ఏ పైప్‌లైన్ ద్వారా ఎంత నీరు వినియోగం అవుతున్నది.. ఎక్కడ ఇంటర్ కనెక్షన్ ఇచ్చారు.. ఎక్కడ ఎన్ని పైన్‌లైన్లను కలిపి వాల్వ్ ఏర్పాటు చేశారు.. అనే విషయాలతో పాటు నగర పైన్‌లైన్ నెట్‌వర్క్ అంతా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ కమాండ్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో స్కాడా లాంటి సాంకేతికతను వినియోగించుకొని ప్రస్తుత కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తే తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేదని నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

రోజూ ఏదో ప్రాంతంలో సమస్యలు..

గ్రేటర్‌లో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సరఫరా బంద్ అవుతున్న పరిస్థితులు ఉన్నాయి. అండర్ రైల్వేగేట్ జోన్‌కు తాగునీటి సరఫరా చేసే ధర్మసాగర్ రిజర్వాయర్ పరిధిలోని ఫిల్టర్ బెడ్, వరంగల్ ప్రాంతానికి తాగునీరు సరఫరా చేసే దేశాయిపేట ఫిల్టర్‌బెడ్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలకు తాగునీరు అందించే వడ్డేపల్లి, కేయూ ఫిల్టర్ బెడ్‌ల పరిధిలో లీకేజీలు, వాల్వ్‌ల మరమ్మతుల పేరిట గ్రేటర్‌లో ఏదో ఒక ప్రాంతంలో రెండు, మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన పీఆర్‌ఎంఈపీ కార్యవర్గం

ఏకగ్రీవంగా పీఆర్ఎంఈపీ ఎన్నికలు

హనుమకొండ, అక్టోబర్ 6 : తెలంగాణ పంచాయత్‌రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (పీఆర్ఎంఈపీ) జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కోడం రవి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా చాట్ల రవికుమార్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సునీల్ కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా అర్పిత, పల్లవి, రమేశ్, రజినీ దేవి, కోశాధికారిగా ఖాజా ఇక్బాల్, జేసీసీ మెంబర్‌గా వసంతరాం, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కరుణ కుమారి, వేణుగోపాల్, కళాజ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా పూర్ణచందర్, ప్రవీణ్, జయరాం, వెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్లుగా ప్రదీప్, శ్రీనివాసరావు, అబ్దుల్ రఫీక్, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, ఇఫ్తార్ మహ్మద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన అభినందన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణ రెడ్డి నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్న పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పించేందుకు, పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తుయనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నందకుమార్ మాట్లాడుతూ.. అడ్‌హక్ ప్రమోషన్ పొందిన సీనియర్ సహాయకులకు రెగ్యులరైజ్ చేసేందుకు రాష్ట్ర స్థాయిలో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.జనగామ, ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు విక్రం, అనిల్, యుగంధర్, విజయపాల్‌రెడ్డి, మోజెస్ ప్రవీణ్ కుమార్, సురేందర్ ప్రసంగించారు.

కోడలు చంపుతానని బెదిరిస్తున్నది

- ఇంటి నుంచి వెళ్లిపోవాలంటున్నది
- న్యాయం చేయాలని ధర్మారంలో వృద్ధురాలి వేడుకోలు

వరంగల్ ఆర్డీవో తీర్పు వెల్లడించిన పత్రాలతో బాధితురాలు సరోజన

గీసుగొండ, అక్టోబర్6: ఇంటి నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే చంపుతానని తన కోడలు బెదిరిస్తోందని గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గోనె సరోజన ఆదివారం విలేకర్ల ముందు తన గోడును వెళ్లబోసుకుంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. 2008లో తన భర్త చేరాలు ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ చనిపోయాడని, 2009లో ఇద్దరు కుమారుల కోసం రెండు ఇళ్లతో పాటు తన కోసం ఒక గదిని నిర్మించుకున్నా. కొద్ది నెలల క్రితం పెద్ద కుమారుడు మహేందర్ క్యాన్సర్‌తో చనిపోయాడు. తానిచ్చిన 20 గంటల భూమిని అమ్మి వైద్యం చేయించినా బతుకలేదు. కుమారుడు చనిపోయిన తర్వాత కోడలు సంధ్య తనను ఇక్కడ ఉండవద్దని హింసిస్తూ దాడులు చేస్తున్నది. 'నీకు మంత్రాలు వస్తాయని, నువ్వు ఇక్కడ ఉండవద్దని, ఎక్కడికైనా వెళ్లి ఉండాలంటూ తనను కొట్టి ఇంట్లోకి రానివ్వకుండా తాళం వేస్తుందన్నారు. ఈ విషయంపై గ్రామంలో పెద్దమనుషులు ఆమెను మందలించడంతో వారిపై సైతం కేసులు పెట్టింది. గతంలో పలు మార్లు గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 15న వరంగల్ ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా కోడలు సంధ్యకు కౌన్సిలింగ్ చేసి, తనకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వృద్ధురాలు సంపాదించిన ఆస్తి, ఇళ్లు ఆమెకే చెందుతాయని, తదనంతరం వారి పిల్లలకు చెందుతాయని ఆర్డీవో చెప్పింది. దీంతో కోడలు సంధ్య తనపై మరింత కక్ష పెంచుకొని చంపుతానని కర్రలు పట్టుకొని బెదిరిస్తుండడంతో తాను బయట ఉండాల్సి వస్తుందని వృద్ధురాలు వాపోయింది. పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఎండోమెంట్ పరిధిలోకి రెండు ఆలయాలు

కాశీబుగ్గ, అక్టోబర్6: గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ ప్రాంతంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి, శ్రీ రంగనాథ స్వామి ఆలయాలను ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చారు. తొందర్లోనే వీటికి వేర్వేరుగా ఐదుగురు సభ్యులతో కూడిన పాలకవర్గం ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ జోన్ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పేరు మీద నోటీసులను ఆలయాలకు అంటించారు. ఆసక్తి గలవారు ఎండోమెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

సుబేదారి, అక్టోబర్6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆదివారం సీపీ అంబర్ కిషోర్‌ఝా ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఏ మహేందర్ గీసుగొండకు, ఇక్కడ పనిచేస్తున్న జి.బాబులాల్ వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్‌కు, టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ రవికుమార్ కేయూసీకి, ఇక్కడ పనిచేస్తున్న బీ సంజీవ్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌కు, వరంగల్ సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న రమేశ్ మామునూరు కు, ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్ ఐజీ మల్టీ జోన్‌కు, ఇంతేజార్‌గంజ్‌లో పనిచేస్తున్న శివకుమార్ వరంగల్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

కన్న వారి కళ్ల ముందే..

ఇద్దరిని బలిగొన్న పిడుగు

- బోరున విలపించిన మృతుల తల్లులు
- ఐనవోలు మండలం వెంకటాపురంలో ఘటన
- 11 కేవీ వైర్లే కారణమంటున్న గ్రామస్తులు

శ్రావణి, రాజు(ఫైల్)

ఐనవోలు, అక్టోబర్ 6 : కన్న వారి కళ్ల ముందే యువతి, యువకుడిని పిడుగు బలితీసుకుంది. రెప్పపాటులో తమ పిల్లలు మృతి చెందడంతో ఆ తల్లులు బోరున విలపించారు. హృదయాలను కదిలించే ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని కట్టు కాలువ వైపున్న రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభం కావడంతో పక్కనే ఉన్న దౌతుబాజి పెద్ద ఉపేందర్ రేకుల దొడ్డిలోకి దౌతుబాజి శ్రీనివాస్, విజయ, రాధాబాయి, ఇందిర, ఆమె కూతురు శ్రావణి (17) వెళ్లారు. అదే సమయంలో మోటర్ సైకిల్‌పై పత్తిబస్తా వేసుకొని ఇంటికి వెళ్తున్న కూకట్ల రాజు (24) తన తల్లి కోమల కలిసి అదే దొడ్డిలోకి చేరారు. ఈ క్రమంలో రేకుల దొడ్డిపై పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో అందులో ఉన్న శ్రావణి, రాజు వారి తల్లులు ఇందిర, కోమల కళ్ల ముందే అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో రాజు తల్లి కోమల కూడా అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలికి జ